సాక్షి అనంతపురం

బుధవారం ၊ 24 ၊ జూలై ၊ 2024



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23 వేలు పలికాయి.



టమాట కిలో రూ.53

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.53, కనిష్టంగా రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో తుంపర్లు పడ్డాయి. గంటకు 10 నుంచి 16 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

5 రోజుల్లో చిరుజల్లులు



బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న 5 రోజుల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 32.4–33.4, రాత్రి ఉష్ణోగ్రతలు 25.3–25.5 డిగ్రీల సెల్సియస్ నమోదు కావొచ్చన్నారు.

ఉద్యోగులకు తీవ్ర నిరాశ

అనంతపురం ఎడ్యుకేషన్: కేంద్ర బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నిరాశ కల్గించిందని ప్రోగ్రెస్సివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) నాయకులు వాపోయారు. యూనియన్ అనంతపురం జిల్లా గౌరవాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీపీఎస్ విధానంలో మార్పులు తెస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానంపై పల్లెత్తుమాట మాట్లాడకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉద్యోగుల ఇన్‌కంట్యాక్స్‌కు సంబంధించి పాత విధానం కంటే కొత్త విధానంలో పన్ను ఎక్కువ చెల్లించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త పన్నుల విధానానికే రాయితీలు ప్రకటించడం ఉద్యోగులను తీవ్ర ఆగ్రహావేశాలకు గురిచేసేలా ఉందన్నారు. బడ్జెట్‌లో 6 శాతం నిధులను విద్యారంగానికి కేటాయించాల్సి ఉండగా, ప్రస్తుత బడ్జెట్‌లో 3.25 శాతం నిధులు కేటాయించారన్నారు. వచ్చే ఐదేళ్లలో నాలుగు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెబుతున్న ప్రభుత్వం.. గడిచిన పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో కనీసం ప్రస్తావించలేదన్నారు. ద్రవ్యోల్బణం 4 శాతానికి తగ్గిందని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి చెప్పారని, అందుకనుగుణంగా ధరలు తగ్గలేదన్నారు. ఇప్పటికైనా మధ్య తరగతి ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రభుత్వం వెంటనే పాత పెన్షన్ పునరుద్ధరణపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పాత పన్నుల విధానంలో రూ. 7 లక్షల వరకు ఎలాంటి పన్ను లేకుండా మినహాయింపు ఇచ్చేలా స్లాబ్ విధానాన్ని సవరించాలన్నారు. కనీసం లక్ష రూపాయలు స్టాండర్డ్ డిడక్షన్‌గా మినహాయింపులు ఉండాలన్నారు.

రైల్వే కో–పైలెట్‌పై చర్యలకు రంగం సిద్ధం



తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రేమికుల జంటపై దౌర్జన్యం చేసిన రైల్వే కో–పైలెట్ రంగయ్యపై క్రమశిక్షణా చర్యలకు ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. 'ప్రేమ జంటపై రైల్వే కో–పైలెట్ దౌర్జన్యం' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై పూర్తి స్థాయి విచారణకు రైల్వే పోలీసు ఉన్నతాధికారులు, రైల్వే అధికారులు ఆదేశించారు. ఈ క్రమంలో మంగళవారం స్థానిక తన కార్యాలయంలో ఎస్‌ఆర్‌ఎం అనిల్‌కుమార్ విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా స్థానిక జీఆర్పీ ఎస్‌ఐ నాగప్పకు గుంతకల్లుకు చెందిన రైల్వే సీఐ నగేష్‌బాబు సైతం ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు తీవ్ర నిరాశ మిగిల్చింది. మాటలు ఘనం చేతలు శూన్యం అన్నట్లుగా ఈ బడ్జెట్ ఉందనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. జిల్లాకు ఉపయోగపడేలా కొత్తగా ఒక్క ప్రాజెక్టునూ ప్రకటించకపోవడం.. ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టులకు సంబంధించి కూడా కేంద్ర మంత్రి పల్లెత్తు మాట మాట్లాడకపోవడంపై అన్ని వర్గాలు పెదవి విరుస్తున్నాయి.

కనికరించని నిర్మలమ్మ!



- ఎన్‌డీయే ప్రభుత్వం రిక్తహస్తం
- నిరాశాజనకంగా కేంద్ర బడ్జెట్
- జిల్లాకు మొండి చేయి చూపిన కేంద్ర ఆర్థిక మంత్రి
- వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీపై కానరాని స్పష్టత
- సెంట్రల్ యూనివర్సిటీపై నిర్లక్ష్యం
- రెండు కారిడార్లతో జిల్లాకు ఒనగూరే ప్రయోజనం శూన్యం
- 'బెల్, 'నాసిన్‌'పై నోరు మెదపని కేంద్ర మంత్రి
- ఉపాధి హామీ పథకం నిధుల పెంపుతో కాస్త ఊరట

అనంతపురం: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉసూరుమనిపించింది. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఎన్డీయే ప్రభుత్వమే ఉండడంతో నిధులు బాగా విడుదల కావొచ్చని ప్రజలు పెట్టుకున్న ఆశలపై నీళ్లు జల్లారు. పదేళ్ల క్రితం విభజన చట్టంలో భాగంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని సాక్షాత్తూ పార్లమెంట్ వేదికగా హామీ ఇచ్చినా, ఇప్పటి వరకూ అమలు పరిచిన దాఖలాలు లేవు. తాజాగా బడ్జెట్ సందర్భంగా వెనుకబడిన ప్రాంతాల అభి వృద్ధికి కట్టుబడి ఉంటామని చెప్పారే తప్ప నిధుల ప్రస్తావన లేదు. కేంద్ర మంత్రి మాటలతో జిల్లా ప్రజలకు ఒనగూరేదేమీ లేదని విశ్లేషకులు అంటున్నారు. ఆయా ప్రాంతాలకు 2014 నుంచి రూ.2 వేల కోట్లు విడుదల చేయాల్సి ఉన్నా, ఇప్పటి దాకా పైసా కూడా విడుదల చేయకపోవడమే నిదర్శనమంటున్నారు.

పారిశ్రామికంపై ప్రకటనేదీ..?

గ్రేటర్ రాయలసీమలో రెండు కారిడార్ల ఏర్పాటుతో పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించారు. కొప్పర్తి, ఓర్వకల్లు కారిడార్లను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అయితే, ఈ రెండు కారిడార్లతో ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఒరిగేదేమీ లేదు. పైగా ఉమ్మడి జిల్లా పరిధిలో పారిశ్రామికాభివృద్ధిపై కేంద్ర మంత్రి స్పష్టమైన ప్రకటన చేయకపోవడంపై పలువురు నిరాశ వ్యక్తం చేశారు.

'బెల్' మోగలేదు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పాలసముద్రం వద్ద ఏర్పాటవుతున్న బెల్ కంపెనీ గురించి కూడా కేంద్ర మంత్రి నోరెత్తలేదు. 10 వేల మందికి ఉపాధి కల్పించే సామర్థ్యమున్న ఈ కంపెనీ ప్రతిపాదనల వద్దే ఆగిపోయింది. భూసేకరణ పూర్తయినా, శంకుస్థాపన చేయడానికి వాయిదాల మీద వాయిదాలు వేస్తూ కాలయాపన చేస్తున్నారు. కనీసం కేంద్ర బడ్జెట్‌లో అయినా కంపెనీ గురించి ప్రస్తావన ఉంటుందని భావించినప్పటికీ ఆ ఊసే ఎత్తలేదు. పాలసముద్రం వద్ద ఏర్పాటైన నాసిన్ సంస్థ నిర్వహణకు నిధులు కేటాయింపుపైనా స్పందన కరువైంది.

సెంట్రల్ వర్సిటీపై నిర్లక్ష్యం..

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణలో భాగంగా 2018లో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీని అనంతపురంలో ఏర్పాటు చేశారు. జంతలూరు వద్ద 2024–25 విద్యా సంవత్సరం నుంచి సెంట్రల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ అందుబాటులోకి రానుంది. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరానికి రూ.350 కోట్ల నిధులు అవసరమని వర్సిటీ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపారు. కానీ సెంట్రల్ యూనివర్సిటీకి ఎన్ని నిధులు కేటాయిస్తారని కేంద్ర బడ్జెట్‌లో స్పష్టత లేకపోవడం గమనార్హం.

'ఉపాధి'కి కాస్త ఊరట..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఈ బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో కేవలం రూ.60 వేల కోట్లు కేటాయించి.. తర్వాత దాన్ని రూ.74,524 కోట్లకు పెంచారు. ఈసారి సుమారు రూ.11,500 కోట్లు అధికంగా కేటాయించడం వల్ల ఉమ్మడి అనంతపురం జిల్లాకు మునుపటితో పోలిస్తే నిధులు కాస్త ఎక్కువగానే వచ్చే అవకాశముంది. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో ఏటా సుమారు రూ.250 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ నిధులు మరింతగా పెరిగితే ఉపాధి పనులు విస్తృతం చేసే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 4,23,065 యాక్టివ్ జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా 8.89 లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు.

సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు చేయూత..

బడ్జెట్‌లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణ సౌకర్యానికి సంబంధించి షరతులు సడలిస్తూ తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఊరట లభించినట్లయింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు 6 వేలు ఉన్నాయి. వీటికి సంబంధించి ఎంఎస్‌ఎంఈ క్రెడిట్ గ్యారంటీ స్కీం కొనసాగిస్తామనడంతో చిన్న తరహా పరిశ్రమలు బలోపేతం కానున్నాయి. ముద్ర స్కీం ద్వారా రుణాల పరిమితి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచుతామని హామీ ఇవ్వడంతో 13 వేల మందికి ప్రయోజనం కలగనుంది.

మహిళలకు కొంత మేలు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 8 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, ఒక స్కిల్ కళాశాల ఉన్నాయి. ఏటా 13 వేల మంది విద్యార్థులకు శిక్షణ కల్పిస్తున్నారు. ఇవే కాకుండా కియా నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 6 వేల మందికి వివిధ పరిశ్రమల్లో ఉపాధి కల్పిస్తున్నారు. మహిళల నైపుణ్య పెంపునకు పెద్దపీట వేస్తామనడంతో సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులకు, మహిళలకు లబ్ధి చేకూరనుంది.

పోరుబాట తప్పదు



బడ్జెట్‌లో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగింది. ఇన్‌కంట్యాక్స్ విషయంలో పెరిగిన ధరలకు అనుగుణంగా స్టాండర్డ్ డిడక్షన్ పెరుగుదల లేదు. ఇక నూతన పెన్షన్ విధానం రద్దు చేయలేదు. పోస్టుల మంజూరుపై ఉన్న ఆంక్షలను కూడా ఎత్తేయలేదు. ముఖ్యంగా 8వ కేంద్ర వేతన సంఘం ఏర్పాటుపై బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం దారుణం. కేంద్ర ప్రభుత్వంపై ఉద్యోగుల పోరుబాట తప్పదు.

– మస్తాన్‌వలి, రైల్వే మజ్దూర్ యూనియన్ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

ఉద్యోగులకు నిరాశే



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగులను నిరాశ పరిచింది. నూతన పెన్షన్ విధానంలో మార్పుల దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో పాత పెన్షన్ ప్రస్తావన లేకపోవడం అన్యాయం. ఉద్యోగుల ఆదాయపు పన్నుకు సంబంధించిన పాత పద్ధతిలో ఎలాంటి మార్పులు చేయలేదు. కేవలం కొత్త పద్ధతిలో మార్పులు చేశారు. పాత విధానంలో పన్నులు చెల్లించే ఉద్యోగులకు రాయితీ ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగులు నిరాశకు గురయ్యారు.

– నల్లపల్లి విజయ్ భాస్కర్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు

నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట



రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించడం శుభపరిణామం. పోలవరం పూర్తి చేస్తామనే హామీ ఊరట కలిగించే అంశం. తక్కువ వేతనం గల ఉద్యోగులకు స్టాండర్డ్ డిడక్షన్ రూ. 50 వేల నుంచి రూ. 75 వేలకు పెంపుదల చేశారు. నిరుద్యోగులకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ అమలుతో ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.

– ఎండీ బావయ్య, ఎకనామిక్స్ మాజీ ప్రొఫెసర్, ఎస్కేయూ

న్యాయం జరుగుతుందనుకున్నాం



చంద్రబాబు, బిహార్ సీఎం నితీష్ కుమార్ మీద ఆధారపడిన ఎన్‌డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేస్తుందని అనుకున్నాం. కానీ పూర్తిగా నిరాశపరిచారు. గతంలో బీజేపీకి కేంద్రంలో మెజార్టీ ఉండడంతో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టలేదు. ఈ దఫా మన మీదే ఆధారపడి ఉంది. అయినప్పటికీ కేటాయింపులు పూర్తిగా పక్కనబెట్టారు. అమరావతి అభివృద్ధికి రూ. 15 వేల కోట్లను ప్రపంచ బ్యాంకు నుంచి అప్పుగా ఇప్పిస్తామని చెప్పడం విచారకరం. వెనుకబడిన జిల్లాలకు గతంలోనే ఎన్‌డీఏ ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తం ఒక్క పెద్ద రోడ్డు వేయడానికి కూడా సరిపోదు. కారిడార్లకు, వెనుబడిన ప్రాంతాలకు ప్రత్యేకంగా ఇన్ని నిధులు ఇస్తామని ఎక్కడా చెప్పలేదు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలి.

– వై. విశ్వేశ్వర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఎంపీలు పోరాడాలి



ఆర్థిక మంత్రి మాటల్లో ఎక్కడా స్పష్టత లేదు. అమరావతికి రూ.15 వేల కోట్లు పలు ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామనడం తగదు. ఆ మొత్తాన్ని నేరుగా గ్రాంటుగా ప్రకటించాలి. పోలవరం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విభజన హామీల అమలుకు కట్టుబడి ఉంటామని చెప్పారే తప్ప నిధుల ప్రస్తావన లేదు. పోలవరానికి రూ. 12 వేల కోట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా స్పందన లేదు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, కడప ఉక్కు, విద్య, వైద్య సంస్థల ఏర్పాటు గురించి ఊసే లేదు. విభజన చట్టం మేరకు 10 సంవత్సరాలుగా నిధులు కేటాయించకుండా బీజేపీ నిర్లక్ష్యం చేసింది. పార్లమెంట్‌లో రాష్ట్ర ఎంపీలు ఈ విషయాలపై పోరాడాలి.

– వి. రాంభూపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి

ఏపీకి ఒరిగేదేమీ లేదు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి ఒనగూరేది శూన్యం. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ. 4 వేల కోట్లు కేటాయించాల్సిన అవసరం ఉంది. 970 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. తిరుపతి అభివృద్ధి గురించి దాటవేశారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్యాయం జరిగింది. అమరావతి అభివృద్ధికి 15 వేల కోట్ల రూపాయలు అప్పుగా కాకుండా నేరుగా గ్రాంట్‌గా ప్రకటించాలి. అప్పు ఇవ్వడం వల్ల రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి వెళుతుంది. ప్రత్యేక హోదా అంశాన్ని గాలికొదిలేశారు.

– సి. జాఫర్, సీపీఐ జిల్లా కార్యదర్శి

గురుకులాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు

- 26న కురుగుంట పాఠశాలలో ఇంటర్వ్యూలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఏపీ సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీతో భర్తీ చేయనున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ అంగడి మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. టీజీటీ పోస్టుకు ..డిగ్రీ, బీఎడ్, టెట్, పీజీటీ పోస్టుకు.. పీజీ, బీఎడ్, టెట్, పీఈటీ, పీడీ పోస్టులకు.. బీపీడీ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇంగ్లిష్ మీడియంలో టీచింగ్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు అన్ని సర్టిఫికెట్లతో ఈనెల 26న కురుగుంట పాఠశాలలో జరిగే ఇంటర్వ్యూ, డెమోకు హాజరుకావాలని కోరారు. బాలుర పాఠశాలలకు పురుష అభ్యర్థులు, బాలికల పాఠశాలలకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయ ఖాళీలు ఇలా...

మలుగూరు (బాలుర) పాఠశాలలో.. టీజీటీ హిందీ, పీజీటీ ఇంగ్లిష్, పీఈటీ, తిమ్మాపురం (బాలికలు) పాఠశాలలో.. టీజీటీ సైన్స్, టీజీటీ గణితం, పీజీటీ గణితం, పీజీటీ జీవశాస్త్రం, పీడీ, కణేకల్లు (బాలుర) పాఠశాలలో.. జేఎల్ గణితం, నల్లమాడ (బాలికలు) పాఠశాలలో.. టీజీటీ ఫిజికల్ సైన్స్, టీజీటీ హిందీ, జేఎల్ ఇంగ్లిష్, జేఎల్ హిస్టరీ, పీఈటీ, బి.పప్పూరు (బాలురు) పాఠశాలలో.. టీజీటీ ఫిజికల్ సైన్స్, టీజీటీ హిందీ, అమరాపురం (బాలికలు) పాఠశాలలో.. టీజీటీ హిందీ, టీజీటీ సోషల్, పీజీటీ ఇంగ్లిష్, పీజీటీ గణితం, హిందూపురం (బాలికలు) పాఠశాలలో.. టీజీటీ ఫిజికల్ సైన్స్, రొళ్ల (బాలురు) పాఠశాలలో.. టీజీటీ ఫిజికల్ సైన్స్, హిందూపురం (బాలురు) పాఠశాలలో.. టీజీటీ ఫిజికల్ సైన్స్, టీజీటీ జీవశాస్త్రం, టీజీటీ హిందీ, పీజీటీ ఇంగ్లిష్.

జీజీహెచ్‌లో ఖాళీ కుర్చీలు కనిపించకూడదు

- కలెక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం మెడికల్: 'ప్రతి వైద్యుడు సమయం ప్రాధాన్యత తెలుసుకోవాలి. నిత్యం కేటాయించిన విధుల్లో కొనసాగాలి. జీజీహెచ్‌లో వైద్యుల సీట్లు ఖాళీగా కనిపించకూడదు. రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలి' అని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగంలో నిర్వహించిన తలసేమియా నివారణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. వైద్యులు చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. బాధ్యతగా వ్యవహరించే వైద్యులను చూసి కింది స్థాయి సిబ్బంది కూడా రోగులకు మెరుగైన సేవలు అందిస్తారన్నారు. తాను కూడా డాక్టరేనని, కర్ణాటక–తమిళనాడు సరిహద్దులో బీఆర్ హిల్స్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో ఉన్న పీహెచ్‌సీలో వలంటీరుగా, మెడికల్ అధికారిగా నెలన్నరపాటు సేవలందించినట్లు తెలిపారు. అక్కడ కొన్ని రోజులపాటు ఎవరూ రాలేదని, నిదానంగా వందలాది మంది వచ్చి చికిత్స పొందారని గుర్తు చేసుకున్నారు. సర్వజనాస్పత్రిలో ప్రతి వ్యాధికీ చికిత్స అందించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. వచ్చే సోమవారం నుంచి జిల్లాలో ఉన్న ప్రతి పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రి ఎన్క్వార్ సర్టిఫికెట్ కోసం వెళ్లాలని, సర్వజనాస్పత్రి కూడా ఎన్ఏబీహెచ్ సర్టిఫికేషన్ కోసం వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీజీహెచ్‌పై ప్రతి సోమవారం సమీక్ష ఉంటుందన్నారు. రోగుల కుటుంబాలకు విశ్రాంతి ధామం ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ట్రామా కేర్‌లో అదనపు మంచాలను ఏర్పాటు చేసి, పారా మెడికల్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం జీసెస్ నగర్‌లో ఉన్న డాక్టర్ల క్వార్టర్స్‌ని కలెక్టర్ తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్, గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికడదాం

అనంతపురం అర్బన్: సామాజిక బాధ్యతగా భావించి బాల్యవివాహాలను అరికడదామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు జరగకూడదన్నారు. ఈ విషయంలో ప్రతి అధికారి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంలో తలెత్తే సవాళ్లను ఎదుర్కోవడంపై దృష్టి పెట్టాలని చెప్పారు. బాల్యవివాహాలు ఎందుకు జరుగుతున్నాయి అనే అంశంపై స్వచ్ఛంద సంస్థలు ఆరా తీయాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి, జిల్లా ఉపాధి కల్పన అధికారులను బాల్య వివాహాల నివారణ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించాలన్నారు. బాల్యవివాహాలు అడ్డుకున్న తరువాత ఆయా కుటుంబాల్లోని వారికి వృత్తి కోర్సుల్లో నైపుణ్య శిక్షణ అందించి జాబ్ మేళాలో ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. బాల్య వివాహాల అనర్థాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, మెప్మా పీడీ విజయలక్ష్మి, డీపీఓ ప్రభాకర్‌రావు, ఎస్డీపీఓ ప్రతాప్‌కుమార్, డీఎంహెచ్ఓ ఈబీదేవి, డీఎల్‌డీఓ ఓబుళమ్మ పాల్గొన్నారు.

అదిగదిగో తుంగభద్రమ్మ

- జిల్లా సరిహద్దుకు చేరుకున్న తుంగభద్ర జలాలు



ఆంధ్రా సరిహద్దులో రెగ్యులేటర్ వద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర జలాలు



జలాలకు పూజలు నిర్వహిస్తున్న హెచ్చెల్సీ సిబ్బంది

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాలు జిల్లా సరిహద్దులోకి ప్రవేశించాయి. మంగళవారం రాత్రి 7.30 గంటలకు ఆంధ్రా సరిహద్దు 105–272 కిలోమీటర్ రెగ్యులేటర్ వద్దకు నీళ్లు చేరుకున్నాయి. ఈ సందర్భంగా హెచ్చెల్సీ సిబ్బంది, ఆయకట్టు రైతులు పూజలు చేసి స్వాగతం పలికారు. గతంలో హెచ్చెల్సీకి నీరు విడుదల చేసినప్పుడు మూడు లేదా నాలుగో రోజుకు జలాలు ఆంధ్రా సరిహద్దుకు చేరేవి. అయితే, ఇటీవల హెచ్చెల్సీలో ఆధునికీకరణ పనులు చేపట్టడంతో ఈ సారి నీరు త్వరగా సరిహద్దుకు చేరాయి. ప్రస్తుతం జలాశయం నుంచి 2,304 క్యూసెక్కుల నీరు హెచ్చెల్సీకి వస్తున్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం రాత్రికి కణేకల్లు చెరువుకు నీరు చేరతాయన్నారు.

డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో తగ్గింది. సోమవారం 1,13,402 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం ఉదయానికి 85,148 క్యూసెక్కులకు పడిపోయింది. అయితే, ఇప్పటికే డ్యాం దాదాపు నిండడంతో గేట్లు ఎత్తి నదికి నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి గానూ 96 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,632 అడుగులకు నీరు చేరింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న డాక్టర్ యుగంధర్

బుక్కరాయసముద్రం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని వైద్య సిబ్బందిని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై మంగళవారం బీకేఎస్ మండలం కొర్రపాడు పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో ఆయన సమీక్షించారు. ఇంటింటా సర్వే చేపట్టి జ్వరపీడితులను గుర్తించి, వెంటనే వారికి సరైన చికిత్స అందజేయాలన్నారు. మాతా శిశు మరణాలు జరగకుండా చూడాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి, పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటి, నీళ్లు పోశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఇందిరా ప్రియదర్శిని, వినోద్‌కుమార్, సీహెచ్ఓ మోహన్‌బాబు, పర్వీన్, శ్రీధర్, మంజుల, నిర్మల, కరుణాకర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏపీజీఎల్ఐసీ సమస్యలు పరిష్కరించండి


జీఎల్ఐసీ డీడీకి వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఏపీజీఎల్ఐసీ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏపీజీఎల్ఐసీ డిప్యూటీ డైరెక్టర్ భాస్కర్ తేజనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు మాట్లాడుతూ.. జీఎల్ఐసీ ఫైనల్ పేమెంట్లు, లోన్లు, మిస్సింగ్స్ క్రెడిట్స్, డెత్ క్లెయిమ్స్‌తో పాటు ఇది వరకే దరఖాస్తు చేసిన అన్ని బాండ్ల క్లెయిమ్స్‌ను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. డీడీని కలిసిన వారిలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి సూర్యుడు, నాయకులు కృష్ణ మోహన్, ఫణి భూషణ్, రాజశేఖర్, నాగభూషణ, రాజన్న ఉన్నారు.

భర్తను చితకబాదిన భార్య


గాయపడిన శ్రీరంగడు

తాడిపత్రి రూరల్: వివాహేతర సంబంధం మంచిది కాదన్నందుకు ఏకంగా ప్రియుడితో కలసి భర్తను ఓ భార్య చితకబాదింది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం చిన్నపొలమడ గ్రామానికి చెందిన శ్రీరంగడు పుట్టుకతోనే మూగ. ఆయన భార్య రేవతి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బండల పాలీస్ యూనిట్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని శ్రీరంగడు పోషించుకుంటున్నాడు. అదే యూనిట్‌లో పనిచేస్తున్న చిన్నపొలమడకు చెందిన ధర్మ తరచూ శ్రీరంగడు కోసం ఇంటికి వెళుతూ రేవతితో పరిచయం పెంచుకున్నాడు. ఈ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. విషయం తెలుసుకున్న శ్రీరంగడు పలుమార్లు తన భార్యను మందలించాడు. అయినా ఆమె వినలేదు. సోమవారం రాత్రి భార్యాభర్తలు మరోసారి ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో ధర్మకు రేవతి ఫోన్ చేసి రప్పించుకుంది. అనంతరం ఇద్దరూ కలసి శ్రీరంగడుపై విచక్షణారహితంగా దాడి చేసి చితకబాది అక్కడి నుంచి ఉడాయించారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న కుమారుడిని చుట్టుపక్కల వారి సాయంతో తల్లి రంగమ్మ ఆస్పత్రికి తీసుకెళ్లింది. రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు.

రుణాలు సక్రమంగా చెల్లించండి

అనంతపురం రూరల్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తీసుకున్న ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణాలు సక్రమంగా చెల్లించాలని లబ్ధిదారులకు ఆ కార్పొరేషన్ ఈడీ సారయ్య సూచించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో రుణాలు తీసుకున్న వారు సక్రమంగా చెల్లిస్తేనే కొత్తవారికి రుణాలు మంజూరు చేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు. నిబంధనల మేరకు నెలవారీ కంతులను సక్రమంగా చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అంతా భారత్ సంచార్

- ప్రైవేటు కంపెనీల నుంచి ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు పోర్ట్ అవుతున్న వినియోగదారులు
- మొబైల్ చార్జీల పెంపుతో బీఎస్ఎన్ఎల్ వైపు ఆసక్తి
- క్రమంగా పెరుగుతున్న బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సంఖ్య
- డిసెంబర్ ఆఖరుకల్లా అందుబాటులోకి 4జీ సేవలు
- మరో 63 టవర్ల ఏర్పాటుకు చర్యలు

ప్రైవేట్ టెలికాం కంపెనీలు ఇటీవల టారిఫ్ పెంచిన నేపథ్యంలో చాలా మంది వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు దృష్టి సారిస్తున్నారు. ప్రైవేట్ టెలికాం కంపెనీలు ఎయిర్‌టెల్, జియో, విఐ (వొడాఫోన్ ఐడియా) ఇటీవల టారిఫ్‌ను భారీగా పెంచాయి. దీంతో సోషల్ మీడియాలో వాటిపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో చాలా మంది బీఎస్ఎన్ఎల్‌కు మారిపోతున్నారు.


పోర్ట్ చేయించేందుకు బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బారులు తీరిన వినియోగదారులు

అనంతపురం సిటీ: టెలికాం రంగంలో ప్రైవేటు సంస్థల ధాటికి తట్టుకోలేక తన ప్రాభవాన్ని కోల్పోయిన బీఎస్ఎన్ఎల్ సంస్థ రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ తన ఉనికిని చాటుతోంది. ప్రైవేటు సంస్థలు టారిఫ్ ధరలు విపరీతంగా పెంచేసిన నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ ఆకర్షణీయమైన ప్యాకేజీలతో వినియోగదారులను ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో బీఎస్ఎన్ఎల్‌కు పోర్టు అవుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో బీఎస్ఎన్ఎల్‌కు 2జీ, 3జీ కలుపుకుని మొత్తం 556 టవర్లు ఉన్నాయి. వీటితో పాటు కొత్తగా మరో 63 టవర్లను ఏర్పాటు చేయనున్నారు. పాత, కొత్త టవర్లన్నింటినీ 4జీ పరిధిలోకి తీసుకురానున్నారు. ల్యాండ్‌లైన్లు 3,360 ఉండగా, బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు 444 ఉన్నాయి. వీటన్నింటినీ ఫైబర్‌కు మార్పు చేసే ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. ఈ ప్రక్రియను డిసెంబర్ నెలాఖరులోపు పూర్తి చేసేలా కార్యాచరణను ముమ్మరం చేశారు. ఆప్టికల్ ఫైబర్ అమలుతో వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలను అందించేందుకు బీఎస్ఎన్ఎల్ సిద్ధమైంది.

టారిఫ్ వార్‌తో మంచి రోజులు

టెలికాం రంగంలో దిగ్గజ సంస్థ అయిన జియో సహా ఎయిర్‌టెల్, వొడా+ఐడియా, ఇతర సంస్థలు టారిఫ్ రేట్లు గణనీయంగా పెంచాయి. ఈ నెల మొదటి వారం నుంచి కొత్త టారిఫ్ రేట్లు అమలులోకి రావడంతో ఆయా కంపెనీల వినియోగదారులు పెంచిన భారాన్ని మోయలేకపోతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ తీసుకున్న నిర్ణయం ఆ సంస్థకు ఊపిరి పోసినట్టైంది. నెలకు కేవలం రూ.200 రీచార్జ్‌తో వినియోగదారులను తనవైపు తిప్పుకుంది. ఫలితంగా ప్రైవేటు సంస్థల వినియోగదారులు చాలా మంది బీఎస్ఎన్ఎల్‌కు పోర్ట్ అవుతున్నారు.

15 రోజుల వ్యవధిలోనే 4,500 మంది

ఈ నెల 18వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,38,258 మంది బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఉండగా... వీరిలో 2,586 మంది పోస్ట్ పెయిడ్, 2,35,672 మంది ప్రీ పెయిడ్ వినియోగదారులు ఉన్నారు. జియో, ఎయిర్‌టెల్, వొడా+ఐడియా(వీఐ), ఇతర సంస్థలు కొత్త టారిఫ్‌ను అమలు చేయడంతో కేవలం ఈ 15 రోజుల వ్యవధిలోనే దాదాపు 4,500 మంది ఆయా ప్రైవేట్ కంపెనీల వినియోగదారులు బీఎస్ఎన్ఎల్‌కు పోర్ట్ అయ్యారు. గతంలో బీఎస్ఎన్ఎల్‌కు ఒకరు వస్తే, ఐదారు మంది ఇతర కంపెనీలకు పోర్ట్ అయ్యేవారు. అదే ఇప్పుడు రివర్స్ అయింది.

అన్నింటినీ అధిగమిస్తాం



ప్రైవేట్ టెలికాం సంస్థలు మొబైల్ చార్జీలను విపరీతంగా పెంచి, వినియోగదారులపై మోయరాని భారం మోపాయి. ఈ నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ సంస్థ ప్రజలకు అండగా నిలవాలనుకుంది. అందుకే ప్రజలకు భారం కాకుండా ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులోకి తెచ్చాం. నెలకు కేవలం రూ.200తో రీచార్జ్, 2జీబీ డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్ అందిస్తున్నాం. ఫలితంగా మా సంస్థ వైపు మొగ్గు చూపుతున్న వినియోగదారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అన్ని సమస్యలను అధిగమించి డిసెంబర్ నెలాఖరుకల్లా 4జీ సేవలు అందుబాటులోకి తెస్తాం.

– షేక్ ముజీబ్ పాషా, జనరల్ మేనేజర్, బీఎస్ఎన్ఎల్, అనంతపురం

తలసేమియా రూపుమాపేలా 'సంకల్ప'ం

- జీజీహెచ్‌లో తలసేమియా వ్యాధిగ్రస్తులకు మెరుగైన చికిత్స
- మరో పది రోజుల్లో అందుబాటులోకి రానున్న వైద్య సేవలు
- ఒప్పందం చేసుకున్న బెంగళూరుకు చెందిన సంకల్ప్ ఫౌండేషన్
- బోన్ మ్యారో చికిత్సకూ సహకారం


సంకల్ప్ సీఈఓ రాకేష్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం మెడికల్: ప్రాణాంతక తలసేమియా వ్యాధితో శిశువులు జన్మించకుండా, ఇప్పటికే తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు అనంతపురంలోని జీజీహెచ్ (సర్వజనాస్పత్రి)తో బెంగళూరుకు చెందిన ప్రముఖ సంకల్ప్ ఫౌండేషన్ అవగాహన ఒప్పందం చేసుకుంది. వాస్తవానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఆస్పత్రిలో సేవలందించేందుకు సంకల్ప్ ఫౌండేషన్ ముందుకురాగా అప్పట్లో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని ఆస్పత్రి ఉన్నతాధికారులు సూచించారు. ఈ మేరకు చేసిన ప్రతిపాదనలకు ఆమోదం దక్కడంతో సేవలు అందించేందుకు సంకల్ప్ ముందుకు వచ్చింది. మరో పది రోజుల్లో తలసేమియా వైద్య సేవలు అందుబాటులోకి రానున్నట్లు సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ క్రమంలో ఏర్పాట్లను పరిశీలించేందుకు మంగళవారం సర్వజనాస్పత్రికి వచ్చిన సంకల్ప్ సీఈఓ రాకేష్‌ను కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతిదీ ఖర్చుతో కూడుకున్నదే..

ప్రస్తుత రోజుల్లో తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు అత్యంత ఖర్చుతో కూడుకున్న చికిత్సలు అందజేస్తున్నారు. ఒక్కోసారి బోన్ మ్యారో మార్పిడి కూడా చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.15 లక్షల వరకూ ఖర్చు అవుతుంది. జన్యుపరంగా వచ్చే తలసేమియా వ్యాధిని ముందుగానే పసిగట్టేందుకు పలు రకాల పరీక్షలూ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే 20 వారాల గర్భంతో ఉన్న మహిళతో పాటు ఆమె భర్తకూ వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో జన్యుపరమైన సమస్యలు నిర్ధారణ అయితే గర్భస్థ శిశువుకూ వైద్య పరీక్ష నిర్వహిస్తారు. ఆ సమయంలో శిశువుకు తలసేమియా వ్యాధి వచ్చే అవకాశం ఉందని నిర్ధారణ అయితే అబార్షన్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా తలసేమియా బారిన పడకుండా చర్యలు తీసుకోవచ్చు. ఈ పరీక్షలకు దాదాపు రూ.5వేల నుంచి రూ.7వేల వరకూ ఖర్చు అవుతుంది. సంకల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పరీక్షలను తాజాగా సర్వజనాస్పత్రిలో ఉచితంగా అందించనున్నారు. అలాగే ఇప్పటికే తలసేమియాతో బాధపడుతున్న వారికి మందులూ ఉచితంగా అందజేయనున్నారు. అవసరమైతే బోన్ మ్యారో చికిత్సకూ సహకరిస్తామని సంకల్ప్ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.

వ్యక్తి దుర్మరణం


నరసింహుడు (ఫైల్)


తిరుపాలు (ఫైల్)

బుక్కరాయసముద్రం: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బీకేఎస్ మండలం భద్రంపల్లికి చెందిన నరసింహుడు (62) మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై అదే గ్రామంలోని అంగడి వద్దకు బయలుదేరారు. మరి కాసేపట్లో అంగడికి చేరుకుంటాడనగా... వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న రాయిని ఢీకొని కిందపడ్డాడు. ఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రాణాలు బలిగొన్న అతి వేగం

విద్యార్థుల అతి వేగం ఓ వృద్ధుడి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... బీకేఎస్‌లోని యల్లమ్మ వీధికి చెందిన బండి తిరుపాలు (65) మంగళవారం ఉదయం తన తోట వద్దకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. తాడిపత్రి రహదారిపై హెచ్చెల్సీ సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన విద్యార్థుల ద్విచక్ర వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన తిరుపాలును స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైలు ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి


సమావేశంలో పాల్గొన్న సభ్యులు

గుంతకల్లు: రైలు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని రైల్వే కన్సల్టివ్ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక రైల్వే జంక్షన్‌లోని మీటింగ్ హాల్‌లో రైల్వే కన్సల్టివ్ కమిటీ సమావేశం జరిగింది. స్టేషన్ మేనేజర్ మురారి మీనా, సీసీఐ (చీఫ్ కమర్షల్ ఇన్‌స్పెక్టర్) జాఫర్‌ఖాన్, మేనేజర్ జీఎం బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు గోపా జగదీష్, చెల్లూరు బద్రీనాథ్, సత్యరంగయ్య, ఆర్‌పీ సురేష్‌గౌడ్, నాగార్జున తదితరులు మాట్లాడుతూ... రైళ్లు స్టేషన్‌లోకి వచ్చే 15 నిమిషాలు ముందే ఏ ప్లాట్‌ఫారంపై వస్తుందో అనౌన్స్ చేయాలన్నారు. ప్లాట్‌ఫారాలు 2, 3, 4, 5లపై మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. సీనియర్ సిటిజన్స్ ప్లాట్‌ఫారాల్లోకి వెళ్లాడానికి బ్యాటరీ వెహికల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్కులేటర్లు 24 గంటలూ పనిచేసేలా చూడాలన్నారు. ప్లాట్‌ఫారాలపై విక్రయించే ఆహార పదార్థాల నాణ్యత మెరుగుపడాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవవాలని విజ్ఞప్తి చేశారు. గుంతకల్లు నుంచి చైన్నె వెళ్లడానికి కొత్తగా ఎక్స్‌ప్రెస్ రైలును ఏర్పాటు చేయడంతో పాటు రద్దీ ఎక్కువగా ఉండే ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలుకూ అదనపు జనరల్, స్లీపర్, ఏసీ కోచ్‌లను జత చేయాలన్నారు. కర్నూలు ప్యాసింజర్ రైలును పునరుద్ధరించడంతో పాటు విజయవాడ, తిరుపతికి గుంతకల్లు మీదుగా వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టాలన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

- వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ నారాయణ



మాట్లాడుతున్న ఎన్‌వీ నారాయణ

అనంతపురం కార్పొరేషన్: వర్షాలు లేక పంటల సాగుకు ఇబ్బంది పడుతున్న రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా రైతులకు అన్నదాత సుఖీభవ, 90 శాతం సబ్సిడీతో డ్రిప్పు, స్ప్రింక్లర్లను తక్షణం అందజేయాలన్నారు. జిల్లాలోని అన్ని చెరువులను నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2014 ఎన్నికలకు ముందు అప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబునాయుడు తప్పుడు హామీలిచ్చి అధికారం చేపట్టిన తర్వాత రైతులను దగా చేశారని, మళ్లీ ఇప్పుడూ అదే ధోరణిలో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో రైతు విభాగం నాయకులు చిదంబరరెడ్డి, చెన్నకేశవులు, రవికుమార్‌నాయక్, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో వంచన


యువతిని మోసం చేసిన బాబు

కుందుర్పి: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని గర్భవతిని చేసి ఉడాయించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... కర్ణాటకలోని పావగడ తాలూకా జాలేడు గ్రామానికి చెందిన యువకుడు బాబు... కుందుర్పి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. ఈ క్రమంలో ఏడాదిగా తరచూ గ్రామానికి వచ్చి ఆమెను కలిసి వెళ్లేవాడు. ఈ క్రమంలో ఆ యువతి గర్భం దాల్చింది. విషయాన్ని బాబుకు తెలిపి పెళ్లి చేసుకుందామని ఆమె ఒత్తిడి చేయడంతో ముఖం చాటేశాడు. విషయం తెలుసుకున్న యువతి కుటుంబసభ్యులు.. మోసగాడి కోసం గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు.

యువకుడి బలవన్మరణం

అనంతపురం: అప్పులు తీర్చేమార్గం కానరాక ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం పాతూరులోని రాణినగర్‌కు చెందిన ఖాదర్‌బాషా (30) ఓ గుజిరీ షాప్‌లో హమాలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల చేపట్టిన ఇంటి నిర్మాణానికి తెలిసిన వారి వద్ద పెద్ద మొత్తంలో అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కానక తీవ్ర మనస్తాపం చెందిన ఆయన మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

టీడీపీ నేతల దౌర్జన్యం

- పంట ధ్వంసం చేసి.. హద్దు రాళ్లు పెకలించిన వైనం
- వారసత్వంగా సంక్రమించిన భూమిని కబ్జా చేసేందుకు యత్నం


దౌర్జన్యంగా ధ్వంసం చేసిన పంట

తాడిపత్రి: వారసత్వంగా సంక్రమించిన పొలాన్ని కబ్జా చేసేందుకు టీడీపీ నేతలు దౌర్జన్యానికి తెగబడ్డారు. ఈ క్రమంలో రైతు సాగు చేసిన పంటతో సహా హద్దు రాళ్లను పెకలించి వేశారు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.... యాడికి మండలం, చందన గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 301బీ లో 2.24 ఎకరాలు, 301సీ లో 5.06 ఎకరాల పొలం అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు సొంత పెద్దబ్బ నరసన్న పేరున ఉండేది. ఆయన మృతి అనంతరం ఆ పొలంలోని 1.46 ఎకరాలను శ్రీనివాసులుకు దాన విక్రయం కింద నరసన్న కుమారులు సుంకయ్య, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, సూర్యనారాయణ 2009లో చేయించారు. వెనువెంటనే రెవెన్యూ రికార్డుల్లోనూ సదరు భూమిని శ్రీనివాసులు పేరుతో ఆన్‌లైన్ చేయించారు. అప్పటి నుంచి శ్రీనివాసులు పంటల సాగు చేస్తూ వస్తున్న ఆ భూమిపై టీడీపీ నేతలు మురళీమోహన్, రాఘవేంద్ర కన్నేశారు. మంగళవారం దౌర్జన్యంగా భూమిలోకి ప్రవేశించి శ్రీనివాసులు సాగు చేసిన కంది, సజ్జ పంటను ధ్వంసం చేశారు. పొలం హద్దు రాళ్లను పెకలించి వేశారు. అడ్డుకోబోయిన వారిని హతమారుస్తామంటూ బెదిరించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

పుట్టపర్తి టౌన్: స్థానిక ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన మేరకు... మామిళ్ళకుంట క్రాస్ వద్ద గుంటిపల్లికి వెళ్లే మార్గంలో పట్టాలపై మృతదేహం ఉన్నట్లుగా మంగళవారం స్థానికుల నుంచి సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. రైలు ఢీకొనడంతో శరీరం రెండు ముక్కలైంది. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. 50 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గంగదేవిపల్లిని సందర్శించిన 'అనంత' వాసులు


బాలవికాస్ సెంటర్ వద్ద అనంత వాసులు

గీసుకొండ: తెలంగాణలోని వరంగల్ జిల్లాలో జాతీయ ఆదర్శ గ్రామంగా గుర్తించిన గంగదేవిపల్లిని బుక్కరాయసముద్రం, నార్పల పామిడి, యాడికి, రాప్తాడు మండలాల్లోని 8 గ్రామాలకు చెందిన 43 మంది ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా బాలవికాస సెంటర్‌లో డైరెక్టర్ ఎస్.సునీత... గంగదేవిపల్లి అభివృద్ధిపై నిర్మించిన డాక్యుమెంటరీ ఫిల్మ్ చూపించారు. గ్రామ కమిటీల ద్వారా సాధించిన అభివృద్ధి పనులు, గ్రామానికి వచ్చిన రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులను జిల్లా ట్రెనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, మంచినీటి కమిటీ మాజీ కార్యదర్శి ఎ.గోపీకృష్ణ, రిసోర్స్‌పర్సన్ జి.సరోజ వివరించారు. కార్యక్రమంలో రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్ శ్రీనివాసులు, రామాంజనేయులు, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఏరియా టీం లీడర్లు లలిత, మల్లికార్జున, రామాంజనేయులు పాల్గొన్నారు.

వైభవం.. భీమలింగేశ్వరుడి రథోత్సవం

విడపనకల్లు: మండలంలోని గడేకల్లులో వెలసిన వేములవాడ భీమలింగేశ్వర స్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా సాగింది. తెల్లవారుజామున ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. సాయంత్రం భీమలింగేశ్వర స్వామి ఉత్సవ మూర్తిని ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై అధిష్టింపజేసి, ఎదుర బసవన్న ఆలయం వరకూ లాగారు. వేడుకకు హంచనహాల్, పాలికి, ఎస్.తిమ్మాపురం, డొణేకల్లు, కడదరబెంచి, విడపనకల్లు, ఆర్.కొట్టాల, గుంతకల్లు, ఉరవకొండ, బళ్లారి, చేళ్ళగురికి, జోళదరాశి, కర్నూలు జిల్లా ఖాజీపురం, గుమ్మనూరు, చిప్పగిరి, రామదుర్గం, ఆలూరు, సాగబండ, కరేకల్లు తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు(ఇన్‌సెట్‌లో) గడేకల్లులో సాగుతున్న భీమలింగేశ్వరస్వామి రథోత్సవం

క్లుప్తంగా

పాఠశాలల్లో శిక్షా సప్తాహ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ రామాంజినేయులు

ఆత్మకూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 28వ తేదీ వరకు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులు ఆదేశించడంతో మంగళవారం పలు పాఠశాలల్లో విద్యార్థులు భాషపై పట్టుసాధించేలా అనేక విషయాలను తెలియజేశారు. అలాగే గణితంలో పట్టు ఎలా సాధించాలన్న విషయాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఎంఈఓ-2 రామాంజినేయులు పలు పాఠశాలను పరిశీలించి శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దశరథ రామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయితీ సెక్రటరీలు తప్పక సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి



ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దశరథరామయ్య

ఆత్మకూరు: మండలంలోని గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దశరథ రామయ్య ప్రజలకు సూచించారు. మంగళవారం తోపుదుర్తి, పి.యాలేరు, పి.సిద్దరాంపురం గ్రామాల్లో ఆధార్ క్యాంపులను ఆయన పరిశీలించారు. ఈ నెల 27వ తేదీ వరకూ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

బాల్య వివాహాల నిషేధంపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని కొత్తూరు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం 'బాల్య వివాహాలు నిషేధం'పై అవగాహన సదస్సు జరిగింది. బాల్య వివాహాలు జరగడానికి కారణాలు, పర్యవసానాలు, నిషేధ చట్టంపై ప్రిన్సిపాల్ వి.గురుప్రసాద్ వివరించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ బి.ఉషాకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.శివప్రసాద్ పాల్గొన్నారు.

28న సమావేశాన్ని జయప్రదం చేయండి

- సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

రాప్తాడు: జిల్లా కేంద్రంలో ఈ నెల 28న జరిగే సచివాలయ ఉద్యోగుల సమావేశాన్ని జయప్రదం చేయాలని సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం రాప్తాడులోని సచివాలయంలో ఉద్యోగులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఏపీ ప్రభుత్వ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో ప్రధానంగా సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఇతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కూడా హాజరు కానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా సహ అధ్యక్షుడు శివ శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్, హనుమంతు, జిల్లా నాయకులు రామాంజినేయులు, రవి కుమార్, రాప్తాడు నియోజకవర్గ కమిటీ నాయకులు వేణుగోపాలరెడ్డి, నవీన్, ధ్రువకుమార్, మల్లికార్జున, రమణారెడ్డి, తనూజా, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

ఊరించి.. ఉసూరుమనిపించి !

- జూలై దాటిపోతున్న చినుకుజాడ కరువు
- బీళ్లుగా మారుతున్న భూములు
- ప్రశ్నార్థకంగా ఖరీఫ్ పంటల సాగు



ఆకాశంలో ఊరిస్తున్న మేఘాలు



కనగానపల్లి మండలం పర్వతదేవరపల్లిలో పంట సాగులేక బీడుగా ఉన్న మెట్ట భూమి

కనగానపల్లి: జూలై నెల దాటిపోతున్నా వర్షం జాడ కానరాకపోవటంతో అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి. ఆకాశంలో మేఘాలు ఊరిస్తున్నా.. ఆషాడం గాలుల దెబ్బకు చినుకు కూడా రాలటం లేదు. దీంతో ఖరీఫ్ పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే రాప్తాడు నియోజక వర్గంలో వేలాది ఎకరాల భూములను బీళ్లుగా కనిపిస్తున్నాయి.

నేలరాలని చినుకు..

జూన్ నెల నుంచే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు సకాలంలో కురిస్తే జూన్ 15 నుంచి జూలై 15 తేదీ లోపల రైతులు పంటలు సాగు చేసేవారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో ఒకటి, రెండు వర్షాలు పడినా తిరిగి వర్షం జాడ లేకపోవడంతో రైతులు డీలా పడ్డారు. ఆకాశంలో మేఘాలు ఊరిస్తున్నా వరుణదేవుడు మాత్రం కనికరించడం లేదు. దీనికి తోడు ఆషాడం గాలులు విపరీతంగా వీస్తుండటంతో వర్షం కురవటం లేదు. నియోజక వర్గ వ్యాప్తంగా జూన్ 15 నుంచి ఇప్పటికి వరకూ ఒక్క పదునైన వర్షం కూడా పడలేదని రైతులు వాపోతున్నారు. మరో వారం రోజులు వర్షం రాకపోతే పంటలు సాగు చేయటం కష్టమేనని కర్షకులు చెబుతున్నారు.

ఖరీఫ్ పంటల సాగు ప్రశ్నార్థకం

రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రతి ఖరీఫ్‌లోనే సుమారు 85 వేల హెక్టార్లలో పంటలు సాగు చేస్తుంటారు. ఇందులో వర్షాధారం కింద మెట్ట భూములలో 70 వేల హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేస్తారు. అయితే ఈ ఖరీఫ్‌లో ఇప్పటి దాకా 10 వేల హెక్టార్లలో కూడా రైతులు పంటలు సాగు చేయలేదు. బోరుబావుల కింద తప్ప మెట్ట భూముల్లో రైతులు ఎక్కడా పంటలు సాగుచేయకపోవటంతో సాగు భూములన్నీ బీళ్లుగా కనిపిస్తున్నాయి. ఈ నెలాఖరులోగానైనా వర్షం కురిస్తే కొన్ని ప్రత్యామ్నాయ పంటలైనా రైతులు సాగు చేసుకొనే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

బీళ్లుగా పెట్టుకున్నాం



ఖరీఫ్ పంటల సాగుకు నేలలు దుక్కి చేసుకోవటంతో పాటు విత్తనాలు, ఎరువులు అన్ని సిద్ధం చేసుకొని పెట్టుకున్నాం. కానీ ఏం లాభం? ఇంతవరకూ నేల చినుకు రాలటం లేదు. దీంతో సాగు భూములన్నీ బీళ్లుగా మారాయి. ఇప్పటికైనా వరుణుడు కరుణిస్తే కొంతమేరనైనా పంటలు సాగు చేసుకుంటాం

- వెంకటరామిరెడ్డి, పర్వతదేవరపల్లి, కనగానపల్లి మండలం

నెలాఖరుదాకా పంటలేసుకోవచ్చు

వర్షం కురిస్తే ఈ నెలాఖరు దాకా మెట్ట భూముల్లో వేరుశనగ పంట సాగు చేసుకోవచ్చు. కంది, ఆముదం, పెసర వంటి ఇతర పంటలు ఆగస్టు నెలాఖరు వరకూ సాగు చేసుకోవచ్చు. అయితే పంట దిగుబడులు బాగా రావాలంటే సకాలంలో పంటలు సాగు చేసుకోవటం మంచిది.

- కృష్ణయ్య, వ్యవసాయశాఖ ఏడీ, ధర్మవరం డివిజన్

కొత్తూరు షాపుల జప్తునకు రంగం సిద్ధం

- బకాయిల చెల్లింపునకు వచ్చే నెల 3న డెడ్‌లైన్
- 30 షాపుల నుంచి రావాల్సిన బకాయి రూ.30 లక్షలు



ఈ నెల 11న కొత్తూరు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపును సీజ్ చేస్తున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, ఆర్ఓ సతీష్

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కొత్తూరు షాపింగ్ కాంప్లెక్స్‌లో గత ఐదేళ్లుగా అద్దె చెల్లించని షాపులను జప్తు చేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా బకాయిలు చెల్లించని 30 షాపుల యజమానులకు అదనపు కమిషనర్ శ్రీహరిబాబు మంగళవారం నోటీసులు జారీ చేశారు. వచ్చే నెల 3లోపు బకాయిలు చెల్లించాలని, లేని పక్షంలో అదే నెల 5న షాపులను పంచానామా చేసి జప్తు చేస్తామని నోటీసులో పేర్కొన్నారు.

32 షాపుల సీజ్:

నగరపాలక సంస్థ పరిధిలోని టవర్‌క్లాక్ సమీపంలో ఉన్న కొత్తూరు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 32 షాపు రూముల లీజుదారులు గత ఐదేళ్లుగా బకాయిలు చెల్లించని విషయం విదితమే. దాదాపు ఆయా షాపుల నుంచి నగరపాలక సంస్థకు రూ.30 లక్షల వరకు బకాయి రావాల్సి ఉంది. నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు గతంలో కొన్ని సార్లు నోటీసులు జారీ చేసినా..లీజుదారుల నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. ఈ క్రమంలో ఈ నెల 11న కమిషనర్ ఆదేశాలతో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 32 షాపులను అధికారులు సీజ్ చేశారు. ఏడు రోజుల్లో చెల్లించని పక్షంలో పంచనామా వేసి షాపు రూంలో ఉన్న సామగ్రిని వేలం వేస్తామని అధికారులు స్పష్టం చేశారు. కాగా కేవలం రెండు షాపుల లీజుదారుల మాత్రం అరకొరగా అద్దె చెల్లించారు. వారు పూర్తి స్థాయిలో చెల్లించాలని నగర పాలక సంస్థ అధికారులు గడువు ఇచ్చారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలి

- మున్సిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి



ఇన్సరేషన్ ప్లాంట్ ను తనిఖీ చేస్తున్న మున్సిపల్ ఆర్‌డీ, కమిషనర్ పీవీవీఎస్ మూర్తి

అనంతపురం కార్పొరేషన్: నగరంలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఆర్‌డీ, నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నగరంలోని టవర్‌క్లాక్, సూర్యానగర్, సంగమేష్ సర్కిల్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. కంపాక్టర్లు, తదితర వాహనాలు సరిగా పని చేస్తున్నాయా? లేదా అని ఆరాతీశారు. రోడ్డుపై చెత్త కనిపించకుండా సిబ్బంది పని చేయాలన్నారు. పూడికతీత పనులను కొనసాగించాలన్నారు. అనంతరం ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద ఉన్న ఇన్సరేషన్ ప్లాంట్‌ను కమిషనర్ పరిశీలించారు. లలిత కళాపరిషత్ వద్ద మురుగు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ శ్రీహరిబాబును కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ వెంట ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్



సఖి వన్‌స్టాప్ సెంటర్ పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి శివప్రసాద్ తెలియజేశారు. మంగళవారం ×సెర€ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం కొడిమి సమీపంలోని ఆదరణ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో ×మహిళ సాధికారిత€పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్జి శివప్రసాద్ మాట్లాడుతూ మహిళలపై జరిగే లైంగిక దాడులను చట్టపరంగా ఎలా పరిష్కరించుకోవాలో తెలియజేశారు. సెర సంస్థ అధ్యక్షుడు కుళ్లాయి స్వామి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. ధైర్యంగా ముందడుగు వేస్తున్నారన్నారు. వారికి రక్షణగా అనేక చట్టాలు వచ్చాయన్నారు. అనంతరం సఖి వన్‌స్టాప్ సెంటర్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఓఎస్సీ ప్రతినిధి శాంతామణి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతినిధి నర్మదా, రమాదేవి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జలధి ఉత్సవం



రాప్తాడు మండలం పాలచెర్లలో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న పీర్లస్వాములు

రాప్తాడు: మండల పరిధిలోని పాలచెర్లలో మంగళవారం మొహర్రం వేడుకలు ముగిశాయి. పీర్ల జలధి ఉత్సవాన్ని హిందూ, ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున పీర్లస్వాములు అగ్నిగుండ ప్రవేశం చేశాయి. సాయంత్రం ప్రత్యేక ప్రార్థనల తర్వాత గ్రామంలో ఊరేగింపు అనంతరం జలధికి తీసుకెళ్లారు. భక్తులు బెల్లపు ఉంటలను పీర్లపైకి విసిరి మొక్కులు చెల్లించుకున్నారు. రాప్తాడు సీఐ మునిస్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామంలో మంగళవారం జలధి ఉత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున పీర్ల స్వాములు అగ్నిగుండ ప్రవేశం చేశాయి. అనంతరం సాయంత్రం పీర్లను జలధికి తరలించారు. గ్రామంలో యువత, చిన్న, పెద్ద అందరూ కలసి ఎంతో సంతోషంగా పండుగ జరుపుకున్నారు.



ఆత్మకూరు మండలం సనపలో జలధికి తరలివెళ్తున్న పీర్లు

పోతలయ్యస్వామికి బోనాలు



పోతలయ్యస్వామికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో పోతలయ్యస్వామి

కనగానపల్లి: మండలంలోని వేపకుంట గ్రామంలో మంగళవారం పోతలయ్యస్వామికి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున బోనాలతో ప్రదర్శనగా వెళ్లి స్వామివారికి సమర్పించారు. అనంతరం పోతలయ్యస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

అంకాలమ్మకు బోనాలు



అలంకరణలో అంకాలమ్మ

ఆత్మకూరు: మండల కేంద్రంలోని అంకాలమ్మ అమ్మవారికి మంగళవారం భక్తులు బోనాలను సమర్పించారు. అనంతరం సద్దికూటి వంశస్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున జంతుబలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న ఈఓఆర్డీ అనిల్‌కుమార్

కనగానపల్లి: మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని ఈఓఆర్డీ అనీల్‌కుమార్ తెలిపారు. కనగానపల్లిలోని గ్రామ సచివాలయంలో మంగళవారం స్థానిక సర్పంచ్ అంకె పరిమళ అధ్యక్షతన పంచాయతీ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన పారిశుధ్య, జలజీవన్ మిషన్ పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధినేతను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



ఢిల్లీలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మంగళవారం ఢిల్లీ చేరుకున్నారు. అక్కడ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకొచ్చాక అరాచక పాలన సాగిస్తోందని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలనే డిమాండ్‌తో ఢిల్లీలో ధర్నా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. బుధవారం ఢిల్లీలో వైఎస్ జగన్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన ధర్నాలో పాల్గొనేందుకు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ సోమవారం రాత్రి ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. మంగళవారం జగన్‌ను కలుసుకున్నారు. బుధవారం జరిగే ధర్నాలో పాల్గొననున్నారు.

వసతి గృహాల్లోని సమస్యలు పరిష్కరించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హాస్టళ్లను సందర్శించారు. మంగళవారం నగరంలోని గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ సమీపంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి, రాష్ట్ర సమితి సభ్యురాలు స్వరూప మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కాస్మొటిక్, డైట్ చార్జీలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మంజునాథ్, రాధాజ్యోతి, పవన్, తారక్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతు



జేసీబీ సహాయంతో పైప్‌లైన్ మరమ్మతులు పనులు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: ఆత్మకూరు లోపలికి వచ్చే హైవే నడిరోడ్డులో సత్యసాయి పైపు లైన్ పగిలిపోయిన నీరు వృథాగా పోతున్న విషయంపై ఈనెల 21న 'సాక్షి'లో తాగునీటి వృథా.. మిగిలేను వ్యథ అన్న శీర్షికన కథనం వెలువడింది. ఈ కథనానికి సత్యసాయి నీటి సరఫరా సిబ్బంది స్పందించారు. హైవే రోడ్డు అధికారుల అనుమతి తీసుకొని మంగళవారం పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించారు.

నేడు మహాకవి జాషువా వర్ధంతి

అనంతపురం కల్చరల్: మహాకవి జాషువా 53వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. వినూత్న కార్యక్రమాలతో సాగే వివరాలను జాషువా సాహిత్య పీఠం నిర్వాహకులు నాగలింగయ్య, నానీల నాగేంద్ర ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్ట్స్ కాలేజ్ ఎదురుగా ఉన్న జాషువా విగ్రహానికి జిల్లాలోని ప్రముఖులతో పుష్పమాలంకరణ జరుగుతుంది. అనంతరం 11 గంటలకు జాషువా సాహిత్యంపై ఆర్ట్స్ కాలేజ్‌లో సదస్సు జరుగుతుంది. జనప్రియ కవి ఏలూరు యంగన్న, ఆచార్య బాలసుబ్రమణ్యం, శ్యామసుందరశాస్త్రి తదితర ప్రముఖులు జాషువా సాహిత్య విశేషాలను విశ్లేషిస్తారు. జాషువా కవిత్వంపై వ్యాసరచన, వక్తృత్వపు పోటీల విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుంది.

నగరపాలక సంస్థలో ఉద్యోగుల స్థానాల మార్పు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో వివిధ సెక్షన్లలో విధులు నిర్వర్తించే ఉద్యోగుల సీట్లను మారుస్తూ మున్సిపల్ ఆర్‌డీ, కమిషనర్ పీవీవీఎస్ మూర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్1గా ఉన్న బీ సునీల్ యూడీఆర్ఐ, సీ1గా ఉన్న ఆశాబేగంను ఈ2, ఏ1గా ఉన్న సాయిశరత్‌ను సీ1, ఈ2గా ఉన్న శరత్‌బాబును బీ4, బీ4గా ఉన్న టీ ఉదయ్‌కుమార్ రెడ్డిని ఏ4, ఏ4గా ఉన్న సావిత్రమ్మను కేఎంసీజీహెచ్ స్కూల్‌కు, జీ3గా ఉన్న ఎం.యుగంధర్ రెడ్డిని మెప్మా అసిస్టెంట్, హెల్త్ అసిస్టెంట్‌గా ఉన్న ఎం. రమాదేవిని జీ3గా, జీ2గా ఉన్న వసుంధర దేవిని పీజీఆర్ఎస్ (మీకోసం), ఆర్ఎంసీహెచ్ స్కూల్‌లో జేఏగా ఉన్న బీఎస్ కృష్ణమూర్తిని కంట్రోల్ రూంకు, కంట్రోల్ రూంలో జేఏగా ఉన్న వై.వెంకటేశులను జీఈ, ఏ2 అసిస్టెంట్‌గా రాంబాబును నియమించారు.

ముత్యాలమ్మకు పూజలు

రాప్తాడు: స్థానిక నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలోని మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి పూజారి రమణ విశేష అలంకరణ చేశారు. పూజల్లో స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442.32 కోట్లు... 'ఖేలో ఇండియా'కే రూ. 900 కోట్లు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం క్రీడలకు ఇచ్చే వార్షిక బడ్జెట్‌ను స్వల్పంగా పెంచింది. మంగళవారం ప్రకటించిన 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442.32 కోట్లు కేటాయించింది. గత ఏడాది ఇచ్చిన రూ.3,396.96 కోట్లతో పోలిస్తే ఇది రూ.45.36 కోట్లు ఎక్కువ. ఎప్పటిలాగే ఇందులో ఎక్కువ మొత్తం దిగువ స్థాయిలో క్రీడాకారులను గుర్తించి తీర్చిదిద్దే 'ఖేలో ఇండియా' పథకానికే కేటాయించింది. గత ఏడాదికంటే రూ.20 కోట్లు ఎక్కువగా 'ఖేలో ఇండియా'కు ఈసారి రూ.900 అందిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా యూత్ గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్‌ల నిర్వహణతో పాటు అత్యుత్తమ స్థాయి శిక్షణ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు, అక్కడ సౌకర్యాల కల్పన కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తారు. మరోవైపు దేశవ్యాప్తంగా స్టేడియాల నిర్వహణ, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్) కోసం ఖర్చు చేసేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు ప్రభుత్వం రూ.822.60 కోట్లు కేటాయించింది. దేశంలోని వివిధ క్రీడా సమాఖ్యలకు ఈ సారి రూ.340 కోట్లు అందజేస్తున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా), జాతీయ డోపింగ్ టెస్టింగ్ లేబొరేటరీ (ఎన్‌డీటీఎల్)ల కోసం వరుసగా 21.73 కోట్లు, రూ. 22 కోట్ల చొప్పున కేటాయించారు.

అజేయంగా సెమీస్‌లోకి

- భారత మహిళల జట్టుకు 'హ్యాట్రిక్' విజయం
- రాణించిన షఫాలీ వర్మ, హేమలత, అరుంధతి


షఫాలీ

దంబుల్లా: అటు బ్యాటింగ్‌లో... ఇటు బౌలింగ్‌లో అదరగొట్టిన భారత మహిళల క్రికెట్ జట్టు ఆసియా కప్ టి20 టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. నేపాల్ జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 82 పరుగుల తేడాతో గెలిచింది. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత జట్టు ఆరు పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి తీసుకోవడంతో వైస్ కెప్టెన్ స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 178 పరుగులు చేసింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (48 బంతుల్లో 81; 12 ఫోర్లు, 1 సిక్స్), హేమలత (42 బంతుల్లో 47; 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 122 పరుగులు జోడించారు. 179 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లు పడగొట్టగా... హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డి, రాధా యాదవ్ 2 వికెట్ల చొప్పున తీశారు. గ్రూప్ 'ఎ'లోని మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ 10 వికెట్ల తేడాతో యూఏఈ జట్టును ఓడించింది. 4 పాయింట్లతో గ్రూప్ 'ఎ'లో రెండో స్థానంతో పాకిస్తాన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. నేడు జరిగే గ్రూప్ 'బి' చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో మలేసియాతో బంగ్లాదేశ్; థాయ్‌లాండ్‌తో శ్రీలంక తలపడతాయి.

స్కోరు వివరాలు

భారత ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (స్టంప్డ్) కాజల్ శ్రేష్ఠ (బి) సీతా రాణా మగర్ 81; హేమలత (సి) రుబీనా ఛెత్రి (బి) సీతా రాణా మగర్ 47; సజన (ఎల్బీడబ్ల్యూ) (బి) కబితా జోషి 10; జెమీమా రోడ్రిగ్స్ (నాటౌట్) 28; రిచా ఘోష్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1-122, 2-133, 3-156. **బౌలింగ్:** కబితా కున్వర్ 2-0-20-0, షబ్నమ్ రాయ్ 4-0-41-0, పూజా మహతో 1-0-13-0, కబితా జోషి 4-0-36-1, రుబీనా ఛెత్రి 1-0-14-0, ఇందూ బర్మ 4-0-29-0, సీతా రాణా మగర్ 4-0-25-2.

నేపాల్ ఇన్నింగ్స్: సంజానా ఖాడ్కా (బి) అరుంధతి రెడ్డి 7; సీతా రాణా మగర్ (బి) అరుంధతి రెడ్డి 18; కబితా కున్వర్ (సి) స్మృతి మంధాన (బి) రేణుక 6; ఇందూ బర్మ (సి) షఫాలీ (బి) రాధా యాదవ్ 14; రుబీనా ఛెత్రి (బి) దీప్తి శర్మ 15; పూజా మహతో (రనౌట్) 2; కబితా జోషి (ఎల్బీడబ్ల్యూ) (బి) దీప్తి శర్మ 0; బిందూ రావల్ (నాటౌట్) 17; డాలీ భట్టా (సి) రిచా ఘోష్ (బి) రాధా యాదవ్ 5; కాజల్ శ్రేష్ఠ (సి అండ్ బి) దీప్తి శర్మ 3; షబ్నమ్ రాయ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 96. వికెట్ల పతనం**: 1-8, 2-21, 3-43, 4-52, 5-64, 6-64, 7-70, 8-82, 9-93. **బౌలింగ్:** రేణుక సింగ్ 4-1-15-1, అరుంధతి రెడ్డి 4-0-28-2, తనూజా కన్వర్ 4-1-12-0, దీప్తి శర్మ 4-0-13-3, రాధా యాదవ్ 3-0-12-2, సజన 1-0-11-0.



ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనేందుకు భారత క్రీడాకారులు పారిస్‌కు చేరుకున్నారు. భారత మహిళా బాక్సర్లు నిఖత్ జరీన్, లవ్లీనా, ప్రీతి, జైస్మీన్... బ్యాడ్మింటన్ స్టార్ సాత్విక్ సాయిరాజ్ అక్కడి ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. క్రీడా గ్రామంలో టెన్నిస్ దిగ్గజం రాఫెల్ నాదల్‌ను సాత్విక్ సాయిరాజ్, భారత టీటీ ప్లేయర్ సత్యన్ జ్ఞానశేఖరన్ కలిసి అతనితో ఫొటోలు దిగారు.



వీళ్ల ఆటను చూడాల్సిందే!

పారిస్ ఒలింపిక్స్‌లో పలువురు దిగ్గజాలు ● చరిత్ర సృష్టించేందుకు సిద్ధం

జీవితంలో ఒక్కసారి ఒలింపిక్స్‌లో పోటీపడితేనే తమ జీవితాశయం నెరవేరినట్లు చాలా మంది క్రీడాకారులు భావిస్తారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని కొందరు జాతీయ హీరోలుగా ఎదుగుతారు. ఒలింపిక్స్ పేరును ఎప్పుడు ప్రస్తావించినా తమ పేరును కూడా స్మరించుకునే విధంగా చరిత్రకెక్కుతారు. తమ అద్వితీయమైన ప్రదర్శనతో తమకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖిస్తారు. ఒలింపిక్స్‌లో పోటీపడటాన్ని... పతకాలను సాధించడాన్ని... ప్రపంచ రికార్డులు సృష్టించడాన్ని అలవాటుగా మార్చుకొని ఎవరికీ అందనంత ఎత్తులో నిలుస్తారు. మరో రెండు రోజుల్లో మొదలయ్యే పారిస్ ఒలింపిక్స్‌లోనూ పలు క్రీడాంశాల్లో దిగ్గజాలు మరోసారి తమ విన్యాసాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. అందులో కొందరి గురించి క్లుప్తంగా...

-సాక్షి క్రీడా విభాగం



సిమోన్ బైల్స్ (జిమ్నాస్టిక్స్)

మెరుపు తీగలా కదులుతూ... అలవోకగా పతకాలు గెలుస్తూ... ప్రపంచ జిమ్నాస్టిక్స్‌లో తనదైన ముద్ర వేసింది అమెరికాకు చెందిన సిమోన్ బైల్స్. 27 ఏళ్ల బైల్స్ వరుసగా మూడో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగనుంది. 4 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న బైల్స్ ఇప్పటి వరకు ఒలింపిక్స్‌లో 4 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు గెలిచింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 23 స్వర్ణాలు, 4 రజతాలు, 3 కాంస్యాలు కైవసం చేసుకుంది. 'పారిస్'లో బైల్స్ మరో పతకం నెగ్గితే ఒలింపిక్స్ చరిత్రలో అత్యధిక పతకాలు నెగ్గిన అమెరికన్ జిమ్నాస్ట్‌గా రికార్డు నెలకొల్పుతుంది. బైల్స్ ఐదు పతకాలు గెలిస్తే... ఒలింపిక్స్ చరిత్రలోనే 12 పతకాలతో అత్యధిక పతకాలు నెగ్గిన జిమ్నాస్ట్‌లలో లారిసా లాతినినా (రష్యా; 18 పతకాలు) తర్వాత రెండో స్థానానికి చేరుకుంటుంది.

ఎలూడ్ కిప్‌చోగి (అథ్లెటిక్స్)



లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్‌లో ఆఫ్రికా అథ్లెట్లకు తిరుగులేదు. పారిస్ ఒలింపిక్స్‌లో కెన్యాకు చెందిన 39 ఏళ్ల ఎలూడ్ కిప్‌చోగి గతంలో మారథాన్‌లో ఎవరికీ సాధ్యంకాని రికార్డును సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నాడు. ఐదోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్న కిప్‌చోగి 2004 ఏథెన్స్ గేమ్స్‌లో 5000 మీటర్లలో కాంస్యం, 2008 బీజింగ్ గేమ్స్‌లో 5000 మీటర్లలో రజతం సాధించాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌కు అర్హత పొందలేకపోయిన కిప్‌చోగి ఆ తర్వాత మారథాన్ (42.195 కిలోమీటర్లు) వైపు మళ్లాడు. 2016 రియో ఒలింపిక్స్‌లో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కిప్‌చోగి విజేతగా నిలిచి రెండు స్వర్ణాలు సాధించాడు. ఈ క్రమంలో అబెబె బికిలా (ఇథియోపియా), వాల్డెమర్ (జర్మనీ) తర్వాత ఒలింపిక్స్ మారథాన్ చరిత్రలో రెండు స్వర్ణాలు నెగ్గిన మూడో అథ్లెట్‌గా నిలిచాడు. పారిస్‌లోనూ కిప్‌చోగి పతకం లేదా స్వర్ణం నెగ్గితే ఒలింపిక్స్ మారథాన్ చరిత్రలో అత్యధికంగా మూడు పతకాలు నెగ్గిన ఏకైక అథ్లెట్‌గా చరిత్ర సృష్టిస్తాడు.

లెబ్రాన్ జేమ్స్ (బాస్కెట్‌బాల్)




ఒలింపిక్స్‌లో బాస్కెట్‌బాల్‌ను 1936 బెర్లిన్ ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ క్రీడాంశంలో అమెరికాయే తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. 1980 మాస్కో ఒలింపిక్స్‌ను బహిష్కరించిన అమెరికా జట్టు ఇప్పటి వరకు బాస్కెట్‌బాల్‌లో 16 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు గెలిచింది. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన అమెరికా ఆ తర్వాత వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లలో స్వర్ణాలు సాధించింది. మరో స్వర్ణమే లక్ష్యంగా అమెరికా పారిస్ గేమ్స్‌లో అడుగు పెడుతుంది. నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) లీగ్ చరిత్రలో టాప్ స్కోరర్‌గా ఉన్న లెబ్రాన్ జేమ్స్ నాలుగోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్నాడు. 2012 లండన్ ఒలింపిక్స్ తర్వాత మళ్లీ విశ్వ క్రీడల్లో ఆడుతున్న లెబ్రాన్ జేమ్స్ తన సహజశైలిలో ఆడితే ఈసారీ అమెరికాకు ఎదురుండదు.

మిజైన్ లోపెజ్ నునెజ్ (రెజ్లింగ్)



గ్రీకో రోమన్ స్టయిల్‌లో ఎదురులేని దిగ్గజ రెజ్లర్. క్యూబాకు చెందిన 41 ఏళ్ల నునెజ్ వరుసగా ఆరో ఒలింపిక్స్‌లో పోటీపడుతున్నాడు. ఇప్పటికే వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లలో స్వర్ణ పతకాలను సాధించాడు. 6 అడుగుల 5 అంగుళాల ఎత్తున్న నునెజ్ పురుషుల గ్రీకో రోమన్ 130 కేజీల విభాగంలో మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా ఉన్నాడు. 2004 ఏథెన్స్‌లో 120 కేజీల విభాగంలో ఐదో స్థానంలో నిలిచిన నునెజ్ ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. 2008 బీజింగ్, 2012 లండన్ ఒలింపిక్స్‌లలో 120 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలు సాధించాడు. 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లలో 130 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలను గెల్చుకున్నాడు. పారిస్ గేమ్స్‌లోనూ నునెజ్ పతకం సాధిస్తే... ఒలింపిక్స్ రెజ్లింగ్ చరిత్రలో ఐదు స్వర్ణాలు లేదా ఐదు పతకాలు నెగ్గిన ఏకైక రెజ్లర్‌గా ఘనత వహిస్తాడు.

టెడ్డీ రైనర్ (జూడో)



పురుషుల జూడో క్రీడాంశంలో 12 సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఫ్రాన్స్ దిగ్గజం టెడ్డీ రైనర్ సొంతగడ్డపై రికార్డుపై గురి పెట్టాడు. వరుసగా ఐదోసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న 35 ఏళ్ల టెడ్డీ రైనర్ ఒలింపిక్స్‌లో 3 స్వర్ణాలు, 2 కాంస్యాలు సాధించాడు. 6 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న టెడ్డీ పారిస్ ఒలింపిక్స్‌లో మిక్స్‌డ్ టీమ్‌తోపాటు హెవీ వెయిట్ విభాగంలో బరిలోకి దిగుతాడు. ఈ రెండు విభాగాల్లోనూ టెడ్డీ స్వర్ణాలు సాధిస్తే ఫ్రాన్స్ తరఫున ఒలింపిక్స్ క్రీడల్లో అత్యధికంగా ఐదు స్వర్ణాలు గెలిచిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. ఫ్రాన్స్ ఫెన్సర్లు లూసియన్ గాడిన్, క్రిస్టియన్ డోరియోలా గతంలో ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణాల చొప్పున సాధించారు.

బైల్స్, లెబ్రాన్ జేమ్స్, కెప్‌చోగి, టెడ్డీ రైనర్, నునెజ్‌లే కాకుండా పోల్‌వాల్టర్ డుప్లాంటిస్ (స్వీడన్), టేబుల్ టెన్నిస్‌లో మా లాంగ్ (చైనా), స్విమ్మింగ్‌లో సెలెబ్ డ్రెసెల్ (అమెరికా), కేటీ లెడెకీ (అమెరికా) కూడా పారిస్ ఒలింపిక్స్‌లో కొత్త చరిత్రను లిఖించే దారిలో ఉన్నారు. వారందరికీ ఆల్ ద బెస్ట్!

సినిమా

రెప్పల్ డప్పల్


● రవితేజ

హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రధారులు. పనోరమా స్టూడియోస్ అండ్ టి-సిరీస్‌ల సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'రెప్పల్ డప్పల్...' అంటూ సాగే రెండో పాట లిరికల్ వీడియోను ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.

మళ్లీ ఎటో వెళ్లిపోయింది మనసు...

ప్రేమకథలను ఇష్టపడే వారి జాబితాలో 'ఎటో వెళ్లిపోయింది మనసు' (2012) సినిమా కూడా ఉంటుంది. నాని, సమంత లీడ్ రోల్స్‌లో నటించగా, గౌతమ్ వాసుదేవ్ మీనన్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది. రేష్మా, ఎస్. వెంకట్, సి. కల్యాణ్, సీవీ రావు నిర్మించిన ఈ సినిమాకు ఇళయరాజా అందించిన బాణీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా 'ఎటో వెళ్లిపోయింది మనసు' సినిమా రీ రిలీజ్ కానుంది. లక్ష్మీ నరసింహా మూవీస్ బ్యానర్ మీద సుప్రియ, శ్రీనివాస్ ఆగస్టు 2న ఈ సినిమాను మళ్లీ విడుదల చేయనున్నారు. ''ప్రస్తుతం తెలుగులో రీ-రిలీజ్‌ల ట్రెండ్ నడుస్తోంది. ఈ ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ సినిమా మళ్లీ ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు నిర్మాతలు.


● సమంత
నాని

మరో ప్రేమకథ ఆరంభం


● నయనతార

ఇప్పటివరకూ పలు ప్రేమకథా చిత్రాల్లో నటించారు నయనతార. తాజాగా సిల్వర్ స్క్రీన్‌పై మరో రొమాంటిక్ లవ్ స్టోరీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారీ బ్యూటీ. తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దగ్గర అసిస్టెంట్‌గా చేసిన విష్ణు ఎడవన్ ఈ న్యూ ఏజ్ రొమాంటిక్ లవ్‌స్టోరీ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మధ్య వయస్కురాలైన ఓ మహిళ, ఓ కుర్రాడి మధ్య ఉన్న ప్రేమ బంధాన్ని నేటి సమాజం ఎలా చూస్తుంది? అనేది ఈ చిత్రం ప్రధానాంశమని కోలీవుడ్ సమాచారం. మధ్యవయస్కురాలి పాత్రలో నయనతార, కుర్రాడి పాత్రలో కెవిన్ కనిపిస్తారు. ప్రస్తుతం నయనతార, కెవిన్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు దర్శకుడు విష్ణు. లలిత్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.

మేమే... మేమే...



● సూర్య

'ఆది జ్వాల... అనంత జ్వాల... వైర జ్వాల... వీర జ్వాల.. దైవ జ్వాల... దావాగ్ని జ్వాల...' అంటూ మొదలవుతుంది 'కంగువా' సినిమాలోని ఫైర్ సాంగ్. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రూపొందిన పీరియాడికల్ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, యోగిబాబు కీలక పాత్రలు పోషించారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 10న విడుదల కానుంది. మంగళవారం సూర్య బర్త్ డే సందర్భంగా 'కంగువా' సినిమాలోని 'ఫైర్ సాంగ్' లిరికల్ వీడియోను విడుదల చేశారు. ''ఈ మట్టి ముట్టే ముందే ఇక్కడ పుట్టింది మేమే మేమే... అంకెలు పుట్టక ముందే లెక్కలు కనిపెట్టింది మేమే మేమే...' అనే లిరిక్స్‌తో సాగే ఈ పాట తెలుగు వెర్షన్‌కు శ్రీమణి సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, దీప్తి సురేష్ ఆలపించారు. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

ది వన్... హీరో సూర్య, దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్య బర్త్ డే సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ వీడియోలో 'ది వన్' అని ఉంది. దాంతో ఈ సినిమా టైటిల్ 'ది వన్' అనే ప్రచారం జరుగుతోంది. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రాన్ని జ్యోతిక, సూర్య, కార్తీక్ సుబ్బరాజు నిర్మిస్తున్నారు.

అశ్విన్ కెరీర్‌లో శివం భజే నిలిచిపోతుంది - విశ్వక్ సేన్


● అనిల్ రావిపూడి, విశ్వక్ సేన్, అశ్విన్‌బాబు, తమన్

''శివం భజే' ట్రైలర్ బాగుంది. నేపథ్య సంగీతం అదిరిపోయింది. ఆగస్టు 1న అశ్విన్‌కు బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులు సక్సెస్ ఇస్తారని ఆశిస్తున్నాను. తన కెరీర్‌లో 'శివం భజే' నిలిచిపోతుంది'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవన్షీ జోడీగా అప్సర్ దర్శకత్వం వహించిన చిత్రం 'శివం భజే'. మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 1న విడుదలవుతోంది. మంగళవారం జరిగిన 'శివం భజే' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి విశ్వక్ సేన్, డైరెక్టర్ అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు తమన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''శివం భజే' ట్రైలర్ బాగుంది. యూనిట్‌కి ఈ చిత్రం మంచి విజయాన్ని అందించాలి'' అన్నారు అనిల్ రావిపూడి. ''అశ్విన్ క్రికెట్‌లో బాల్‌ను ఎలా బాదుతాడో బాక్సాఫీస్‌ను కూడా అలానే బాదాలి'' అన్నారు తమన్. ''పరమేశ్వరుడి కథతో రూపొందిన ఈ సినిమా అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అన్నారు అప్సర్. ''ముస్లిం అయిన అప్సర్‌గారు 'శివం భజే' లాంటి కథను ఎలా రాశారో అనుకున్నాను. ఇదంతా శివ లీల అనిపించింది'' అని అన్నారు అశ్విన్‌బాబు.

ఆ ఫైర్‌తో డైరెక్టర్ అయ్యా! - బండి సరోజ్ కుమార్



''నేను గతంలో 'నిర్బంధం, నిర్బంధం 2 , మాంగల్యం' వంటి సినిమాలు తీశాను. వాటిని కొన్ని వర్గాల ప్రేక్షకులు మాత్రమే చూశారు. కానీ 'పరాక్రమం' చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకులు చూడొచ్చు'' అని బండి సరోజ్ కుమార్ అన్నారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన సినిమా 'పరాక్రమం'. శ్రుతీ సమన్వి, నాగ లక్ష్మి, మోహన్ సేనాపతి, నిఖిల్ గోపు, అనిల్ కుమార్ ఇతర పాత్రల్లో నటించారు. బీఎస్‌కే మెయిన్ స్ట్రీమ్ పతాకంపై రూపొందిన ఈ మూవీ ఆగస్టు 22న విడుదల కానుంది. బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ– ''సంఘర్షణతో కూడుకున్న కథే 'పరాక్రమం'. నేను ఇండస్ట్రీకి రాక ముందు ఓ హాస్టల్‌లో ఉండేవాణ్ని. ఓ రోజు క్రికెట్ ప్రాక్టీస్ చేస్తుంటే.. 'క్రికెటర్ అవుతావా? మీ ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఏంటి? వెనక చూసి ముందుకు వెళ్లాలి బ్రదర్' అని ఓ వ్యక్తి అన్న మాటలు నాలో కసిని నింపాయి. ఏదో ఒకరోజు అతను నన్ను తలెత్తుకుని చూడాలనుకున్నాను.. ఆ ఫైర్‌తోనే డైరెక్టర్ అయ్యాను'' అన్నారు.

నాలుగువందల ఏళ్ల నాటి గుడి కథతో...


● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

ఓ పురాతన గుడి ముందు తుపాకీ పట్టుకుని నిల్చున్నారు హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్. ఆ గుడి నాలుగు వందల ఏళ్ల క్రితం నాటిది. ఆ గుడికి హీరో ఎందుకు వెళ్లాలనుకుంటాడు? అనేది తెలుసుకోవడానికి కాస్త సమయం ఉంది. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో మహేశ్ చందు ఓ సినిమాను నిర్మిస్తున్నారు. దివంగత ప్రముఖ దర్శకులు కోడి రామకృష్ణ 75వ జయంతి, హీరో శ్రీనివాస్ ఇండస్ట్రీలోకి నటుడిగా వచ్చి పదేళ్లు పూర్తి కావడం... ఈ రెండు సందర్భాలను పురస్కరించుకుని ఈ సినిమాను మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ''ఈ సినిమా చిత్రీకరణ ఇప్పటికే మొదలైంది. జూలై 24న రెండో షెడ్యూల్‌ను మొదలుపెట్టనున్నాం. కమర్షియల్ అంశాలతో కూడిన శక్తివంతమైన, ఆసక్తికరమైన కథను సిద్ధం చేశారు లుధీర్'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

సరికొత్తగా కనిపిస్తాను - రక్షిత్ అట్లూరి



''పలాస 1978, నరకాసుర' చిత్రాల తర్వాత అన్నీ సీరియస్ రోల్స్ చేస్తున్నానని చాలామంది అన్నారు. కానీ 'ఆపరేషన్ రావణ్, శశివదనే' సినిమాల్లో నా పాత్రలు సీరియస్‌గా ఉండవు. ఈ సినిమాల్లో సరికొత్తగా కనిపిస్తాను. 'ఆపరేషన్ రావణ్' నన్ను ప్రేక్షకులకు మరింత దగ్గర చేసే సినిమా అవుతుంది'' అని రక్షిత్ అట్లూరి అన్నారు. వెంకట సత్య దర్శకత్వంలో రక్షిత్ అట్లూరి, సంగీర్తనా విపిన్ జంటగా నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 26న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ– ''యువ ప్రేక్షకులకు చేరువయ్యేలా థ్రిల్లర్ మూవీ నిర్మిస్తే బాగుంటుందని 'ఆపరేషన్ రావణ్'ని తీశాం. ఈ మూవీ షూటింగ్ టైమ్‌లో మా నాన్న వెంకట సత్యంగారి డైరెక్షన్ పట్ల నాతో పాటు రాధిక, చరణ్ రాజ్‌గార్లు కూడా సంతోషంగా ఫీలయ్యారు. ఈ సినిమాలో మనలోని ఆలోచనల అంతర్యుద్ధాన్ని చూపించే ప్రయత్నం చేశాం. ఇలాంటి థ్రిల్లర్ సినిమాను థియేటర్‌లో చూస్తేనే ఆ అనుభూతి కలుగుతుంది. ప్రస్తుతం 'పలాస 2' స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది'' అన్నారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

రాజ్ తరుణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'పురుషోత్తముడు'. హాసినీ సుధీర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో ప్రకాశ్‌రాజ్, మురళీ శర్మ, రమ్యకృష్ణ, బ్రహ్మానందం, ముఖేష్ ఖన్నా ఇతర కీలక పాత్రల్లో నటించారు. రామ్ భీమన దర్శకత్వంలో డా. రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రామ్ భీమన మాట్లాడుతూ– ''దర్శకుడిగా నేను 'ఆకతాయి, హమ్ తుమ్' అనే రెండు సినిమాలు చేశాను. ఆ తర్వాత ఆరేళ్లకు నాకు 'పురుషోత్తముడు' చాన్స్ వచ్చింది. విజయం సాధించాలనే పట్టుదలతో ఈ సినిమా చేశాను'' అన్నారు. ''మంచి క్లీన్ ఎంటర్‌టైనర్ మూవీ తీశామని గర్వంగా చెప్పగలం'' అన్నారు రమేశ్ తేజావత్. ''పురుషోత్తముడు'లో మంచి పోలీసాఫీసర్ రోల్ చేశాను. ఈ సినిమా సక్సెస్ కావాలి'' అన్నారు బ్రహ్మానందం. ''ఈ సినిమాలో నటించడాన్ని ఆస్వాదించా. రాజ్ తరుణ్ ఈ ప్రెస్‌మీట్‌కు రాలేదు. త్వరలోనే ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడతారు'' అన్నారు రాజా రవీంద్ర. ''నాది మహారాష్ట్ర. నన్ను తెలుగు అమ్మాయిలా ఆదరించాలని కోరుకుంటున్నాను. ఫ్యామిలీతో కలిసి ఈ సినిమాని అందరూ థియేటర్స్‌లో చూస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు హాసినీ సుధీర్.


● హాసినీ సుధీర్